

భోగి మంటలు.. పండగ వెలుగులు

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ఇళ్ల ముంగిళ్లు భోగి మంటల వెలుగులో కళకళలాడాయి. దీంతో కాలనీలు, బస్తీల్లో పండగ వాతావరణం కనిపించింది. కాలనీల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కథలు కనిపించారు. ఉదయం ఇళ్ల ముందు సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజించారు.

– చిక్కడపల్లి







వివేకనగర్‌లో భోగిమంటల వద్ద స్థానికులు

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



నల్లకుంట: ధనుర్మాసం పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ స్వామి, ఆంజనేయ స్వామి, సాయిబాబాకు ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అలాగే అర్చకస్వాముల మంత్రోచ్చారణల నడుమ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. ఉదయం, మధ్యాహ్నం సుమారు వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయం పునర్‌నిర్మాణ కమిటీ జానకీ సుధాకర్, కార్యనిర్వహణ అధికారి ఎం.దేవనాథం పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి(మల్లన్న) ఆలయంలో సోమవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు దృష్టి కుంభాల కోసం బియ్యం పోసి పూజలు చేశారు. ఒగ్గు పూజాలు మల్లన్న స్వామిని కొలుస్తూ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ, మల్లికార్జునరెడ్డి, హారిక, సురేష్, రాజు, గోపి, ఒగ్గు పూజారులు సిద్ధం నాగేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



ముషీరాబాద్: పద్మశాలికాలనీలోని సంజీవ హనుమాన్ దేవాలయంలో సోమవారం గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోదాదేవి ఉత్సవమూర్తిని పద్మశాలికాలనీ నుంచి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారి బింగి నవీన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించడంతో పాటు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారి భక్తిగీతాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షుడు కృష్ణ, సలహాదారులు సుదర్శన్, పుండరీకం, సీతా, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడికి నృత్య నీరాజనం

చిక్కడపల్లి: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుడిని స్మరిస్తూ నృసింహ కూచిపూడి నాట్య భారతి బృందం నృత్య నీరాజనం అర్పించారు. సోమవారం త్యాగరాయ గానసభలో నాట్య గురువు ఆక్కుల శ్రీనివాస్‌కుమార్ శిష్య బృందం ఆలేఖ్య శ్రీనివాస్‌కుమార్, అలేఖ్య ఆభిగ్య, దేదీప్య, తత్విక, నితిక, హరిప్రియ తదితరులు గణేష్ స్తుతి, పుష్పాంజలి, రామ శబ్దం తదితర అంశాలు చూడ ముచ్చటగా లయబద్ధంగా నర్తించారు. ఈ సందర్భంగా పీవీ మూర్తి పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానందుడి సందేశం నేటి యువతరానికి తెలియాలన్నారు.

ఈ నెల 10న సాక్షిలో ప్రచురించిన కథనం



రాత్రి హడావిడి.. తెల్లారే సరికి పరారీ!

రత్నానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ వింత పోకడ

10వ తేదీ రాత్రి సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



పేపర్‌లో వస్తేనే స్పందిస్తారా?

'సాక్షి' వరుస కథనాలతో రత్నానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

నల్లకుంట: రత్నానగర్‌లో ఏడాదిక్రితం పైపులైన్ పనుల కోసం స్ట్రీట్ నంబర్–6లో అభివృద్ధి పనుల కోసం రోడ్డును తవ్వారు. అయితే పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించాడు. తవ్విపోసిన రోడ్డు కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌ను బస్తీ వాసులు పలుమార్లు కోరినా స్పందించలేదు. విసిగిపోయిన బస్తీవాసులు సమస్యను 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చారు. ఈనెల 8వ తేదీన 'అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం' పేరిటి సాక్షిలో ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన కాంట్రాక్టర్ అదే రోజు సాయంత్రం రోడ్డు నిర్మాణం కోసం సామగ్రిని చేరవేశాడు. తీరా తెల్లారేసరికి ఏర్పాటు చేసిన పరికరాలను తొలగించారు. ఈ విషయమై ఈ నెల 10వ తేదిన 'రాత్రి హడావుడి.. తెల్లారే సరికి పరారీ!' పేరిట మరో కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పందించిన సదరు కాంట్రాక్టర్ 11వ తేదీన రాత్రి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి తెల్లవారే సరికి పూర్తి చేయించాడు. సాక్షిలో వచ్చిన కథనంతో ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బస్తీవాసులు సంతోషంతో సాక్షికి ధన్యవాదాలు తెలియజేశారు.

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వాకిళ్లల్లో భోగి ముగ్గులు వేసుకున్న స్థానికులు

మందా జగన్నాథం సేవలు చిరస్మరణీయం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం సేవలు చిరస్మరణీయమని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని మందా జగన్నాథం నివాసంలో ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాలుగు సార్లు లోకసభ సభ్యుడిగా, ఒకసారి తెలంగాణ నుంచి ఢిల్లీ ప్రతినిధిగా పనిచేసి దళిత బహుజన సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మందా జగన్నాథం కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన మృతి బహుజనులకు తీరని లోటని అన్నారు. భౌతికంగా లేకపోయినా ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతారని అన్నారు.



మందా జగన్నాథం భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్

శాకాంబరిగా శారదాంబ

భక్తి శ్రద్ధలతో చండీ హోమం

నల్లకుంట: ధనుర్మాసం పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం నల్లకుంట శంకరమఠానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు గావించిన అర్చక స్వాములు, చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. అలాగే లోకమాత శారదాంబను పట్టువస్త్రాలు, పూలమాలలు, వివిధ రకాల కాయగూరలతో అలంకరించగా శాకాంబరిగా దర్శనమిచ్చారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించే నూతన వస్త్రాలు, గాజులు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి గావించారు. అనంతరం చండీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, భక్తులకు ప్రసాద వితరణ గావించి అన్నదానం చేశారు.



ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలి

చిక్కడపల్లి: గంగపుత్రులు, బెస్తలు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుండు జగదీష్‌బాబు అన్నారు. సోమవారం చిక్కడపల్లి గంగపుత్ర బెస్త సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 కేలండర్‌ను సంఘం కార్యాలయంలో అయన ముఖ్యఅతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం గంగపుత్రుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వరాల వెంకటేశ్, వినోద్, సురేందర్, నరసింహస్వామి, యాదగిరి, రాజ్‌కుమార్, సుజాత, ధనలక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

అరుంధతినగర్‌లో...

అరుంధతినగర్ గంగపుత్ర బెస్త సంఘం 14 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తోందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అరుంధతినగర్‌లో గంగపుత్ర సంఘం రూపొందించిన నూతవ సంవత్సర కేలండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు కైరంకొండ నర్సింగ్, బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ, నాగుల ప్రకాష్‌లతో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధ్యక్షుడు పూసరాజు, ప్రధాన కార్యదర్శి గాండ్ల దేవయ్య, కోశాధికారి కైరంకొండ వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు కాకమేని నవీన్, సలహాదారులు కొమ్ము సంగయ్య, మానుకొల సురేష్, పెంట చందు, నవీన్, ప్రవీణ్, ధనంజయ్, కనకరాజు, పంది భాస్కర్ , రాంచందర్, సాయి గణేష్, పాక దేవేందర్, రామచందర్, మల్లేష్, మోహన్, సాయికృష్ణ, వెంకటేష్, బాబులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గుండు జగదీష్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

ముషీరాబాద్: నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే దుకాణాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు హెచ్చరించారు. సోమవారం పతంగులు విక్రయించే పఠాన్ బస్తీలోని పలు దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ.. చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించిందన్నారు. దాని వల్ల చేతులు తెగుతాయని అన్నారు. ఇది ఎంతో ప్రమాదకరమని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చైనా మాంజాను వాడొద్దని ప్రజలను కోరారు. పతంగులు ఎగరవేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లను గమనిస్తూ ఉండాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేయడానికి అంకితభావంతో పని చేస్తానని డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షులు పాశం సాయకృష్ణయాదవ్ అన్నారు. డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను సోమవారం డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఎంసీ మోహన్, బి.లక్ష్మణ్‌రావు, విన్ను ముదిరాజ్, రమేష్‌గుప్తా, లక్ష్మీనారాయణ, దర్గా నర్సింగ్‌రావుతో పాటు పలువురు లలితనగర్‌లోని ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం రెండోసారి తనకు అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. డివిజన్‌లో సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా అందరి సహకారంతో సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. త్వరలోనే డివిజన్ నూతన కమిటీని నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.నరేష్, గౌరీశంకర్, జగదీష్, ప్రదీప్, వంశీ, కౌండిన్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే శ్రీరామ ట్రస్ట్ లక్ష్యం

అంబర్‌పేట: ఆకలితో ఉన్న నిరుపేదల కడుపు నింపడానికి శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యంగా పని చేస్తుందని ట్రస్ట్ ప్రతినిధులు, శ్రీకాంత్, కాశేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణలు తెలిపారు. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పేదలకు భోజన ప్యాకెట్లను అందించారు. సమయానికి పట్టెడన్నం దొరకని వారికి తమ ట్రస్ట్ అన్నదానం చేయడంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. సోమవారం 500కు పైగా ఆహార ప్యాకెట్లను పేదలకు అందించామన్నారు. త్వరలో పేదలకు అవసరమయ్యే మందులు ఉచితంగా అందిస్తామన్నారు.

18న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన శ్రీ త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 69వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అంబర్‌పేట సంగీత సిస్టర్స్ యశస్విని, తేజస్వినులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని షిర్డీ సాయిబాబా ఆలయంలోని ధ్యాన మందిరంలో ఆ రోజు సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా టీవీ దర్శక–నిర్మాత శోభా శంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రార్థనా గీతం ఉంటుందని అనంతరం చిన్నారులు హిరణ్య, భావన, హితాంష్, సూర్యతేజ, దివిజ, శ్రీవిద్య, శ్రీకర్, విదీష, సాయి, చేతన్‌శర్మ, గాయత్రి, శ్రావణి, ప్రణీత, సాయి శ్రేయాస్, తేహిత, అభిగ్నలచే ఉత్సవ సంప్రదాయ కీర్తనలు ఉంటాయని చెప్పారు. అనంతరం సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ స్వీయ పర్యవేక్షణలో పంచరత్న కీర్తనల గానం ఉంటుందని తెలిపారు. ఇందులో యశస్విని, వాసుకీదేవి, అరుణశ్రీ, విజయ్ కృష్ణ, రఘురాం తదితరులు పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని చెప్పారు. అలాగే సంగీత విద్యాలయం విద్యార్థులచే స్వామివారి అష్టోత్తర పూజ ఉంటుందన్నారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గాలిపటాల పంపిణీ

అంబర్‌పేట: జాతీయ పతాకం ప్రాముఖ్యతను చాటేలా రూపొందించిన గాలి పటాలను చిన్నారులకు అందిస్తున్నట్లు చేతన ఫౌండేషన్ అధ్యక్షుడు దేశబోయిన శ్రీధర్ తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం హిమాయత్‌నగర్‌లో జాతీయ పతాక నమూనాతో రూపొందించిన 400 గాలిపటాలను చిన్నారులకు అందించినట్లు తెలిపారు. జాతీయ భావం, పండుగల ప్రాముఖ్యతను పెంపొందించడమే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు.



చిన్నారులకు పటాలను అందిస్తున్న కేశబోయిన శ్రీధర్

బీసీల చైతన్యానికి అధ్యాపకులు కృషి చేయాలి

అంబర్‌పేట: బీసీల చైతన్యానికి అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీల ఉద్యమం, వారి అభ్యున్నతికి విద్యావంతులు ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ బీసీ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య విచ్చేసి మాట్లాడారు. బీసీ విద్యార్థులు, యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత అధ్యాపకులపై ఉంటుదన్నారు. బీసీ ఉద్యోగుల్లో పదోన్నతులపై అన్యాయం జరుగుతుందని దీనిపై ప్రభుత్వాల దృష్టికి తీసెకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. 50 ఏళ్లుగా బీసీల ఐక్యతా, వారి సమస్యలపై పోరాడుతునే ఉన్నానని, ప్రస్తుతం బీసీల్లో కాస్త ఐక్యత, చైతన్యం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు కె.సుదర్శన్ మాట్లాడుతూ బీసీ అధ్యాపకులు ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం తమ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. బీసీ భావజాల వ్యాప్తికి తాము అంతా పాటుపడుతామన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, నందగోపాల్, సుధాకర్, పృథ్వీ, ఉదయ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

డిజిటల్ బసవన్న!



ఆన్‌లైన్ పేమెంట్ తీసుకుంటూ కనిపించిన డూడూ బసవన్న..

భోగి, సంక్రాంతిని పురస్కరించుకొని చిక్కడపల్లిలో సోమవారం ఉదయం డూడూ బసవన్నలు సందడి చేశారు. కీసరకు చెందిన నాగరాజు గంగిరెద్దుల ఆడించుకుంటూ గల్లీ గల్లీ తిరిగాడు. గంగిరెద్దు కొమ్ముల మధ్య క్యూఆర్ కోడ్ పెట్టడంతో ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్స్ చేశారు. ఇది చూసిన వివేక్‌నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ దుర్గమ్మ దేవాలయం వద్ద ఆలయ పూజారి భారత్–పే చేశారు.

– చిక్కడపల్లి



ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

అంబర్‌పేట: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళలు వేసిన రంగురంగుల రంగవల్లులు ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కాచిగూడలోని తెలంగాణ భావసార్ క్షత్రియ రంగ్‌రేజా మహిళా పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పోటీలు జరిగాయి. దీనిలో భాగంగా మహిళలకు కాన్వస్ పెయింటింగ్, ముగ్గులు వేయడం, నాన్‌ఫైర్ కుకింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా పరిషత్ ప్రతినిధులు విజయలక్ష్మి, సంగీత, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యపార్కులో ముగ్గుల పోటీలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సుందరయ్యపార్కులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, శైలజామోహన్, పద్మాగౌడ్, కోశాధికారి ఎం.దశరథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది మహిళలు పాల్గొని తమ ప్రతిభను చాటారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, లిక్కర్‌రెడ్డి, సునీల్, జాలివాకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మెగా డిజిటల్స్ ఆధ్వర్యంలో..

నల్లకుంట: సంక్రాంతి పర్వదివాన్ని పురస్కరించుకొని నల్లకుంటలోని మెగా డిజిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో రేవతి వెగ్గలం వేసిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.